# బాధ్యత

లలిత వీధి గుమ్మంలో నిలబడింది. పదకొండు గంటలు దాటింది. ఎండ చిరచిరలాడిస్తోంది. గేటు దగ్గరకొచ్చి నిలబడి లలిత రోడ్డుకిరువైపులా పరికించి చూస్తోంది. ఆమె ముఖం అలసటగా, కాస్త నీరసంగా ఉంది. చీర బాగా నలిగిపోయి ఉంది. తల దువ్వుకున్నట్లు లేదు. లేచినప్పటినుంచి పనీ, పనీ ఒకటే పని. చేస్తూనే ఉంది. ఇంట్లో పనంతా చేసి, అందర్నీ బయటికి పంపేసరికి తలప్రాణం తోకకొచ్చింది.

ఇంతకీ అసలు సంగతేమంటే వారం రోజులుగా పనిమనిషి రావడం లేదు. అంట్లు తోమడం, ఇల్లు తుడవడం, బట్టలుతకడం, వంట చేయడంతో లలిత వళ్లు హూనమై పోయింది. నిన్నటి రోజు రాత్రి కాస్త జ్వరం తగ్గినా నీరసం దిగలాగేస్తుంటే కొంచెం కొంచెం పని చేసి అందర్నీ బయటికి పంపేసి ఎవరైనా పనిమనుషులు ఇళ్లకెళ్లిపోతు కనిపిస్తారేమో పట్టుకుందామని వీధిలో నిలబడింది.

కాసేపు నిలబడి అటు ఇటు చూసి కాళ్లు లాగుతుంటే లోపలికొచ్చేసింది. వరండాలో కుర్చీలో కూర్చుని చూపులు రోడ్డుమీద వేసింది.

'అమ్మగారూ.. కాసిని మంచినీళ్లు ఇస్తారా అన్న మాటలతో ఉలిక్కిపడింది. తను కళ్లు తెరిచి చూస్తున్నాననుకుందిగానీ శరీరం కుర్చీలో చేరేసరికి కళ్లు మూతలు పడ్డాయని గ్రహించింది. ఆ వచ్చిన పిల్లకి పదమూడు, పధ్నాలుగేళ్లుండవచ్చు. నల్లగా ఆరోగ్యంగా ఉంది. లలిత లోపలికెళ్లి చెంబుతో నీళ్లు తీసుకు వచ్చేసరికి ఆ పిల్ల పక్కన మరో పిల్లకూడా ఉండటం చూసింది. ఇద్దరు ఆత్రంగా మంచినీళ్లు గటగట తాగేసారు. వాళ్లని చూస్తే జాలేసింది. చాలా దూరం నుంచి వస్తున్నట్టున్నారు. పైన ఎండ మాడ్చేస్తోంది.

'ఇక్కడ సాయి భవనం అనే ఇల్లు ఎక్కడో తెలుసాండి' అంది ఒకమ్మాయి.

'సాయి భవనమా... అంటే.. ఎక్కడని చెప్పారు' అంది లలిత. వాళ్లు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. కానీ సరిగ్గా చెప్పలేకపోయారు. అయితే వాళ్లు వెంటనే వెళ్లిపోలేదు. దూరంగా వస్తూ మరొక ఆడపిల్ల కనిపించింది. ఆమె కూడా వీళ్లని చేరి ఏదో గుసగుసలాడింది. దానర్థం ఇల్లు ఎక్కడో తెలీలేదని.

లలిత వెళ్లి మళ్ళీ కుర్చీలో కూర్చుంది ఆ పిల్లలు మాత్రం గేటునానుకునే నిలబడి ఉన్నారు. ఒకరితో ఒకరు పెద్దగా మాట్లాడుకోవడం లేదు గానీ బెదురు చూపులు చూస్తున్నారు. ముఖాలు ఆకలితో నకనకలాడుతున్నట్టుగా ఉన్నాయి.

మొట్టమొదట వచ్చిన పిల్ల నల్లగా ఉంది. కానీ రెండో పిల్ల తెల్లగా, కాస్త సన్నగా నాజూకుగా ఉంది. చెంపలు ఆరోగ్యంగా విరిసీ విరయని గులాబీ మొగ్గల్లా మెరుస్తున్నాయి. వీరిని వచ్చి చేరిన మూడో పిల్ల ఈ ఇద్దరికంటే కాస్త పొట్టిగా చామన చాయగా ఉంది. అయితే ఈ ముఖం, కళ్లు, మనుషుల్ని కట్టిపడేసే అందంతో మెరిసిపోతున్నాయి. ఆ పిల్లని చూసి లలిత కాస్త ఆశ్చర్యపోయింది. మొదటి పిల్ల నెమ్మదిగా గేటు తీసుకుని లోపలికి వచ్చింది.

'ఏదైనా పనుంటే చేస్తాం – మా సుట్టాలింటికొచ్చాం, ఇల్లు కనబడలేదు' అంది.

లలిత ఉలిక్కిపడింది. పని చేస్తాం అన్నమాట ఆమెకి అద్భుత అశరీర వాణి పలుకులా వినిపించింది.

''ఏం పనిచేస్తారు'' అంది

'ఇంట్లో ఏ పనైనా'

'ఎక్కడనుంచి వచ్చారు'

'తెనాలి నుంచి'

'సరే అన్నం పెడతాను డబ్బులేమివ్వమంటారు' అంది లలిత. వాళ్లు ఎంత ఇమ్మన్నా ఇచ్చే ధోరణిలో.

'డబ్బులొద్దండీ. అన్నం పెట్టండి' అంది.

ముగ్గురాడపిల్లలు ఇంట్లోకొచ్చి ఒకతె అంట్లు తోమేసింది. మరొకామె బట్టలన్నీ శుభ్రంగా ఉతికేసి ఆరేసింది. మూడో పిల్ల ఇల్లంతా చీపురుతో తుడిచి తడిగుడ్డ వేసి తళతళలాడించేసింది.

లలిత మూడు పావుల బియ్యం కుక్కర్‌లో పడేసింది. ముగ్గురికీ పచ్చడీ, సాంబారు, మజ్జిగ వేసి కడుపునిండా అన్నంపెట్టి కబుర్లు మొదలుపెట్టింది.

మొదటి పిల్ల పేరు పార్వతి – వాళ్లు కాపుటల. రెండో పిల్ల రమాదేవి – వాళ్లు రజకులట. మూడో పిల్ల సుందరి – మేదర వాళ్లట.

వాళ్ల ఊరూ, తల్లిదండ్రుల పేర్లు, కులమూ అన్నీ చెప్పేశారు. వాళ్లని బాగా మాట్లాడించాక తేలిందేమంటే ముగ్గురూ ఒకే ఊరులో, ఒకే వీధిలో ఉండే పిల్లలు. ముగ్గురూ, తల్లిదండ్రులకు చెప్పకుండా వచ్చేసారు.

'ఎందుకూ' అంది లలిత భయంగా

'మా అమ్మా నాన్నలకు మేమంటే అస్సలు ఇష్టం లేదండి' అన్నారు ముగ్గురు ఏక కంఠంతో.

'మా అమ్మరోజూ నన్ను సచ్చిపోవే - సచ్చిపోతే పీడాపోతుంది అని తిట్టి పోస్తుంది. ఎంత పనిచేసినా చివాట్లు, దెబ్బలు తప్పవు. నాన్నకీ ప్రేమలేదు, అమ్మకీ లేదు. మా తమ్ముడున్నాడు వాడంటేనే ఇష్టం. వాడూ నన్ను కొడతాడు. అయినా వాడినేం ఎవ్వరూ అనరు.

లలిత అవాక్కయి చూస్తూండిపోయింది.

''ఆరో క్లాసు పాసయ్యాను. ఆడపిల్లవు చదువెందుకని మానిపించేసారు''. పార్వతి గుడ్ల నీరు కుక్కుకుంటూ చెప్పింది.

''మేం నలుగురం ఆడపిల్లలం. నేను మూడోదాన్ని. నన్ను మా ఇంట్లో బయటికి రానివ్వరు. ఎవ్వరితో మాట్లాడనివ్వరు. ఎప్పుడు తిట్టిపోస్తారు. చిన్న గుడిసెలో ఎప్పుడు లోపలే ఉండాలి. మా అయ్య రోజుకి రెండుసార్లయినా చితకబాదుతాడు. ఏడులోకి రాగానే పెద్దమనిషినయ్యానని బడి మానిపించేసారు. నాకు చదువుకోవాలని ఇష్టం'' - రమాదేవి విచారంగా చెప్పింది.

వీళ్ళ మాటలు చెప్తుంటే అందమైన సుందరి కళ్లు విషాదంతో నిండిపోయాయి.

'మా అమ్మ చచ్చిపోయిందండి. మారుడు తల్లి. రోజు గరిట కాల్చి వాతలు పెడుతుంది. నాన్న ఆమెనేమీ అనడు. పైగా ఆమె చెప్పినట్టు వినమని నాలుగు తగిలిస్తాడు అంది.

వాళ్ల ముగ్గురు చెప్పింది విన్నాక లలిత కాస్సేపేం మాట్లాడలేకపోయింది. కాస్సేపాగి

'మీరిలా ఇల్లు వదిలి వస్తే ఎంత ప్రమాదమో తెలుసా' అంది మందలింపుగా

'మాకేం భయం లేదండి. మేము కష్టపడి పనిచేసుకుని బతుకుదామని వచ్చాం'

'మీరలాగే అనుకోవచ్చు. కానీ ఈ పట్టణంలో మీకు రక్షణేముంది?'

ఎవ్వరూ కాసేపు మాట్లాడలేదు.

'ఏం చెయ్యం? రోజూ తన్నులు తింటూ, చివాట్లు పడుతూ బతికేకంటే చావే నయం' నిరాశగా అంది పార్వతి.

''తప్పు అలా మాట్లాడకూడదు. అమ్మా నాన్న మీ మంచికోసమే మీకేదైనా చెప్పారు గానీ మీరిలా కనిపించకుండా పోతే వాళ్లెంత కంగారుపడుతూ ఏడుస్తుంటారో తెలుసా'' లలిత కాస్త గట్టిగానే అంది.

'వాళ్లకలాంటివేమీ లేవులెండి. హాయిగా ఉండి ఉంటారు' కసిగా నిర్లక్ష్యంగా అంది రమాదేవి.

ముగ్గుర్నీ ఎంతసేపు మాట్లాడించినా వాళ్ల చెప్పేదొకటే - ఇంట్లో వాళ్లకి ఆదరణ, ప్రేమ లేదు. చివాట్లు, దెబ్బలు, ఈసడింపులు - అందుకే ఎలాగైనా బతుకు దామని పారిపోయి వచ్చేసారు.

సాయంత్రమయ్యేసరికి లలితకి సమస్య పూర్తిగా అర్థమైంది. ఈ ఈడొచ్చిన పిల్లలు ఏ దుర్మార్గుల చేతుల్లోనైనా పడితే ? గంటల్లో వీళ్లని ఊళ్లే కాదు, దేశాలు కూడా దాటించగల దుర్మార్గులున్నారీ దేశంలో. వీళ్లు ఇంతవరకూ అదృష్టవంతులు అనుకుంది లలిత.

ఇప్పుడు వీళ్లనేం చేయాలి ? ఎలా జాగ్రత్తగా వాళ్ల తల్లిదండ్రులకు చేర్చాలి?

'మీ వెంట ఎవరూ పడలేదు, అదృష్టవంతులు' అంది.

'లేదండి మా వెంట ఓ కుర్రాడు మమ్మల్నే చూస్తూ చాలా దూరం వచ్చాడు. మేం జాగ్రత్తగా తప్పించుకొచ్చాం'

'మా టీచరమ్మగారు ఎప్పుడు చెప్పేవారు, ఎక్కడికైనా వేరే ఊరెళ్తే మగాళ్ళని నమ్మకూడదు. ఆడాళ్లనే నమ్మాలని చెప్తుండేవారు'

లలిత ఆశ్చర్యపోయింది. 'ఇలాంటి మహానగరాల్లో కొందరు ఆడాళ్లని నమ్మడం కూడా ఎంత ప్రమాదమో అర్థం చేసుకోగల అనుభవం వీరికి లేదు' అని బాధపడింది.

వాళ్లని మాటల్లో పెట్టి ఎన్ని ప్రశ్నలు వేసినా వారు చెప్పేవన్నీ నిజాలు కాదని, కొన్ని అబద్ధాలు చెప్తున్నారని అర్థం చేసుకుంది. వారు దిగులుగా ఉన్నారు. అశాంతిగా ఉన్నారు. కానీ ఇంటికి మాత్రం వెళ్లమని పట్టుదలతో ఉన్నారు.

సమయానికి భర్త ప్రసాద్ కూడా లేకపోవడంతో ఎవర్ని సలహా అడగాలా ? ఏం చెయ్యాలా అనే ఆలోచనలో పడిపోయింది లలిత. ఆమెకున్న స్నేహితుల్లో సునీత గుర్తుకొచ్చింది. ఆమె ధనవంతురాలు. వాళ్ల వ్యాపారస్తులు. అందువల్ల కార్లు, బంగళాలు, చీరలు, నగలు ఆమె ప్రపంచం. అయినా లలితంటే ఎంతో ఇష్టం, గౌరవం. అందుకే సునీతకి ఫోన్ చేసింది. క్లుప్తంగా విషయమంతా చెప్పింది.

'పంపెసేయ్, నీకెందుకు తలనొప్పి. ఇలాంటి వాళ్ల ఇంట్లో చేరినట్లే చేరి సమస్యగా తయారవుతారు. వాళ్ల వెనకాల పెద్ద పై ముఠాలుంటాయి. ఇల్లు దోచేస్తారు. మొన్న ఓ రెండు నెల్ల క్రితం కలకత్తాలో....' సునీత ఫోన్‌లో పెద్ద కథే చెప్పింది.

లలిత ఫోన్ పెట్టేసి వచ్చి పార్వతిని, రమాదేవిని, సుందరిని చూసింది. వారి ముఖాలు అమాయకంగా స్వచ్ఛంగా కనిపిస్తున్నాయి.

రమాదేవి ఆరిన బట్టలన్నీ దులిపి మడతలు పెడుతోంది. సుందరి డాబా ఎక్కి జాజిపువ్వులు కోసుకొచ్చి మాల కడుతోంది. పార్వతి దొడ్డి శుభ్రంగా తుడుస్తోంది. లలితకి వాళ్లని చూస్తే గిల్టీగా అనిపించింది. ఒక్క పూట భోజనం పెట్టినందుకు తాను వాళ్ల చేత శక్తికిమించిన చాకిరీ చేయించుకుంటున్నాని పించింది. కానీ వారి చేతల్లో కృతజ్ఞత బాగా కనిపిస్తోంది.

ఈ సమాజంలో ప్రతి వ్యక్తి తన భద్రత గురించి భయపడడంతోనే సరి పెట్టుకుంటే పక్కవారిని గురించి ఆలోచించే అవకాశం ఎలా వస్తుంది ? ఆపదలో ఉన్న వారిని ఆదుకునే అదను ఎలా కలుగుతుంది ? అజ్ఞానంతో తప్పుడు తోవలో పోయే వారికి సరైన మార్గం చూపించే పరిస్థితి ఎలా ఏర్పడుతుంది ? అనుమానంతో చూస్తే అన్నీ సందేహాలుగానే కనిపిస్తాయి.

లలిత ఆలోచనలోంచి తేరుకుని ఏం చెయ్యాలా అని మథనపడసాగింది. ఏదో ఒకటి చేయాలి. ఆమెకి మరో ఫ్రెండ్ పద్మావతి గుర్తుకు వచ్చింది. ఆమెకి ఫోన్ చేసింది. పద్మావతి చదువుకున్నది. మంచి ఉద్యోగంలో ఉన్నదీను. అందుకే మంచి సలహా ఇస్తుందని ఆమెకి ఫోన్ చేసి విషయం వివరించింది.

అంతా విని నువ్వు వెంటనే పోలీస్ స్టేషన్‌లో అప్పగించేయ్. వాళ్లే చూసు కుంటారు. నీకెందుకు తలనొప్పి, ఇలా ఇంట్లోంచి వచ్చేసిని వాళ్ల నిజాలు చెప్పరు. ఒక్కొక్కసారి మనల్ని భలే ఫూల్స్ చేస్తారు' అంది ఎంతో తెలివిగా.

'మరీ... పోలీస్ స్టేషన్‌లో...' లలిత అనుమానంగా అంది.

మరేం పర్లేదు. మనమే చదువుకున్న వాళ్లం పోలీసుల్ని నమ్మకపోతే ఎలా ?

'అది కాదు. రాత్రి వాళ్ల స్టేషన్‌లో ఆడవాళ్లని ఉంచుకోకూడదు'

'అవన్నీ నీకెందుకు ? వాళ్లకప్పచెప్పేయ్. నాకు డిఐజి తెలుసు. చెప్పమంటే చెప్తాను' అంది.

వద్దు వద్దు - లలిత ఆలోచనలో పడింది.

ఇప్పుడున్న స్థితిలో ఈ అమాయకమైన పల్లెటూరి పిల్లల్ని పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం భావ్యంగా అనిపించలేదు. పైగా వాళ్లకా విషయం తెలియగానే ఎంత కంగారు పడతారో ఊహించగానే మరీ జాలి కలిగింది.

చీకటి పడింది ఇల్లంతా శుభ్రంగా ఉంది. గదుల్లో రాళ్లన్నీ తళతళమెరుస్తు న్నాయి. దొడ్డంతా క్లీన్‌గా ఉంది. ఇలాంటి ఒక్క పిల్ల ఇంట్లో ఉండే హాయిగా ఉంటుందని లలిత మధ్యతరగతి మనసు ఒక క్షణం ఊగిసలాడింది. ఉన్నట్టుండి మైత్రి జ్ఞాపకం వచ్చింది. అసలు మైత్రి తనకింత ఆలస్యంగా ఎందుకు గుర్తుకు వచ్చిందా అని తనమీద తనే చిరాకు పడింది. లలితకి మైత్రి చేసే పని తెలుసు. ఆమె మనస్తత్వం తెలుసు. మైత్రికి ఒక ఆదర్శ మహిళా మండలి ఉంది. ఆ స్వచ్ఛంద సంస్థ ఎంతో కొంత స్త్రీలకి సేవ చేస్తోంది. వారికంటు ఒక హోం ఉంది. వారు ఈ పిల్లల్లాంటి వారికి ఆశ్రయం ఇవ్వగలరు. వారి తల్లితండ్రుల్ని రప్పించి మాట్లాడగలరు. పిల్లలు చేతులు మారకుండా సురక్షితంగా సన్మార్గంలో జీవనోపాధి కల్గించగలరు.

లలితా నువ్వు మంచి పని చేశావు. ఇప్పుడు రాత్రవుతోంది కదా. రేపు ఉదయం పది గంటలకి ఇక్కడికి తీసుకొచ్చేయ్. ఏ సమస్యా ఉండదు. వారు సురక్షితంగా ఉండే ఏర్పాటు చేద్దాం' అంది మైత్రి.

మర్నాడు మైత్రి పిల్లల్ని బుజ్జగించి తీరు చూసి లలిత ఆశ్చర్యపోయింది. ముగ్గురు వెక్కి వెక్కి ఏడ్చారు. మైత్రికి అబద్దాలు చెప్పలేదు. వాళ్ల వాళ్ల ఎడ్రస్లు చెప్పారు. కానీ మళ్లీ తల్లిదండ్రుల దగ్గరకెళ్లమని చెప్పారు. ఇక్కడే పరువైన పనేదైనా చేసుకుని బతుకు తాం అని చెప్పారు.

పరువైన పని అని ప్రత్యేకించి చెప్పడం వల్ల ఇద్దరూ చలించిపోయారు. వీళ్ల మరో రకంగా మళ్లించబడి ఉంటే ఎంత అన్యాయమైపోయి ఉండేవారు అని తలచుకుని విలవిల్లాడిపోయారు.

మూడో రోజు ఏడ్చుకుంటూ పార్వతి, రమాదేవి తల్లిదండ్రులు వచ్చారు. సుందరి తండ్రి మాత్రం వచ్చాడు. మైత్రి వాళ్లని బాగా చివాట్లు వేసింది.

మన సమాజంలో ఆడపిల్లంటే చూపించే వివక్షత వల్ల ముక్కుపచ్చలారని ఆడపిల్లలు అన్యాయమై పోతున్నారు. ఇంట్లో లభించని ప్రేమాభిమానాలు ఎక్కడో దొరుకుతాయని బయటకొచ్చి బలిపశువుల్లా అమ్ముడుపోయి నరక కూపంలో కూరుకు పోతున్నారు. దీనికి ఎవరు బాధ్యత వహించాలి ? ఆడపిల్లల్ని వేధించి, బాధిస్తే వారు ఇల్లు వదిలి ఇలా మురికి కూపంలో కూరుకుపోతే బాధ్యత ఎవరిది ? ఈ బాధ్యత అందరి మీదా ఉంది. ఎక్కడో ప్రభుత్వమనీ, ఎవరో పోలీసులని, ఎక్కడో సేవాసమితులనీ కాదు. ప్రతి వ్యక్తీ ఇలాంటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలి. అని ఎవరికర్థమయ్యే భాషలో వాళ్ళకి చెప్పగలిగింది మైత్రి..

ఈ మాటలన్నీ సునీత, పద్మావతి లాంటివాళ్ళు కూడా వింటే బాగుండేది అనుకుంది లలిత.

ఆంధ్రభూమి డైలీ
మే *10, 1997*